క్లుప్తంగా

ఏఎస్ఐలకు కొనసాగిన అవుట్‌డోర్ పరీక్షలు



నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలోని 58 మంది ఏఎస్ఐలకు ఎస్ఐ ఉద్యోగోన్నతుల కోసం నిర్వహిస్తున్న పరీక్షలు మంగళవారం రెండో రోజుకి చేరాయి. గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అవుట్‌డోర్ పరీక్షలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. ఏఎస్ఐలకు నీట్ టర్న్‌అవుట్, ఫుట్ డ్రిల్, వెపన్ డ్రిల్, వెపన్ ప్రూవింగ్, మార్చ్ ఫాస్ట్, నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ తదితర అంశాలపై పరీక్షలు జరిగాయి. ఏఎస్ఐల నుంచి ఐజీ పలు ప్రశ్నలకు సమాధానాలను అడిగి తెలుసుకున్నారు.

తెలుగును నిర్లక్ష్యం చేయరాదు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంగ్ల భాష మోజులో పడి తెలుగును నిర్లక్ష్యం చేయరాదని సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు నీతి పద్యాలు, దాశరథి శతకాలు, తెలుగు భాష ప్రాముఖ్యతపై పాటలు, నృత్యాలు, నాటికలు, కథానికలతో అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగుభాషలో చక్కని పదాలు ఉన్నాయని, విద్యార్థులు తెలుగులో స్పష్టంగా మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు, మేకల శేషకుమారి, ప్రిన్సిపాల్ కళ్యాణి, హెచ్ఎం మీనాక్షి, ఉపాధ్యాయులు సీతామహాలక్ష్మి, జయశ్రీ, పి.సుధాకర్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలి



గుంటూరు మెడికల్: రాజ్యాంగ స్ఫూర్తితో అందరం పనిచేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాస్ రెడ్డి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, నాయకులు భీమినేని చంద్రశేఖర్, చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, వైవీ సుబ్బారావు, రాష్ట్ర సెల్ కన్వీనర్ తోట రామకృష్ణ, అబ్దుల్ హుదూస్ పాల్గొన్నారు.

ముగిసిన నేషనల్ ఫార్మసీ వారోత్సవాలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫార్మసీ వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు ఫార్మసీ రంగంలో ఉన్నత సంస్థల్లో ఉద్యోగాలు పొందే నైపుణ్యాన్ని సాధించాలని సూచించారు. పోటీలలో గెలిచిన విద్యార్థిని విద్యార్థులకు రిజిస్ట్రార్ బహుమతులు ప్రదానం చేశారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ ప్రమీల రాణి, అధ్యాపకులు డాక్టర్ డి.రవి శంకర్ రెడ్డి, డాక్టర్ యు.అన్నపూర్ణ, డాక్టర్ కేతు ప్రవల్లిక, డాక్టర్ పి.రవి, డాక్టర్ ఎం గాయత్రి రమ్య, కె.విజయ్ కిషోర్ పాల్గొన్నారు.

ట్యాప్ కనెక్షన్లు తొలగించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో తాగునీటి పన్ను, మీటర్ల చార్జీలు చెల్లించని ట్యాప్ కనెక్షన్లను తొలగించాలని, పన్ను వసూలులో రాజీ లేదని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో రెవెన్యూ, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగ అధికారులతో పన్ను వసూలు, పారిశుద్ధ్య పనులు, హౌస్ జియో ట్యాగ్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిహెచ్.శ్రీనివాస్, సీఎంఓహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ రవిబాబు, ఈఈ సుందర్‌రామిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే దిక్సూచి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బాలవజ్రబాబు, నూరిఫాతిమా

నెహ్రూనగర్: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే దిక్సూచి అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు), పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. భారత రాజ్యాంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం లాడ్జిసెంటర్, తూర్పు నియోజకవర్గం 57వ డివిజన్‌లోని గడ్డిపాడు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నో మతాలు, కులాలు, జాతులు కలిసి మనుగడ సాగిస్తున్నాయంటే అది మన రాజ్యాంగం గొప్పతనమేనని అన్నారు. అంతటి మహత్తరమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన డాక్టర్ అంబేడ్కర్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని కొనియాడారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ సమానత్వంతో కూడిన అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా తమవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పఠాన్ రీహనా, అబిద్, మెహమూద్, పాపతోటి అంబేడ్కర్, రామనబోయిన అజయ్, యాట్ల రవి, దూపాటి వంశీ, ముఖ్య నాయకులు అగ్గిపెట్టి రాజు, తుమ్మేటి శ్రీను, మర్రి సత్యనారాయణ, పోలవరపు వెంకటేశ్వరరావు, బికరీ, ఆవుల కోటేశ్వరరావు, నరకట్ల శ్రీను, నందేటి రాజేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగం ద్వారానే సమాన అవకాశాలు..

నెహ్రూనగర్: భారతదేశంలో వివక్షకు తావులేకుండా అందరికీ అన్ని రంగాల్లో సమాన అవకాశాలను రాజ్యాంగం ద్వారానే అందుతున్నాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో విభాగాధిపతులు, సిబ్బందితో కలసి భారత రాజ్యాంగ పీఠికను పఠించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యుత్తమ రాజ్యాంగంగా భారత రాజ్యాంగం నిలవడంలో అంబేడ్కర్ కృషి మరువలేనిదన్నారు. దేశ ప్రజలు రాజ్యాంగం ద్వారా అందిన హక్కులతో పాటు సామాజిక బాధ్యతలను కూడా పాటించాలని కోరారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎగ్జామినర్ నాగేంద్ర కుమార్, అసిస్టెంట్ ఎగ్జామినర్ పద్మజ, సీఎంహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

గుంటూరు బార్ అసోసియేషన్‌లో..

నగరంపాలెం: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాల్లోని రాజ్యాంగం కంటే భిన్నమైనదని ది గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో విభిన్న జాతులు, మతాలు, భిన్నమైన సంస్కృతులు, రకరకాల భాషలతో కూడిన దేశంలో అందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగం రూపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనూరాధ, సీనియర్ న్యాయవాది మధిర నాగేశ్వరరావు, రాయపూడి మణి, లూథర్‌బాబు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓ కార్యాలయంలో..

గుంటూరు మెడికల్: రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు, డాక్టర్ రత్నమన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ జయ రామకృష్ణ, డాక్టర్ ప్రియాంక, జయప్రసాద్, డెమో పాల్గొన్నారు.

ఆర్డీ కార్యాలయంలో.

గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ షేక్ నాగూర్ షరీఫ్, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు బుసి శ్యామ్, అనిల్, శ్రీకాంత్, సుబ్బారావు, సురేష్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

గుంటూరు మెడికల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)గుంటూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని అంధు వికలాంగుల శిక్షణ కేంద్రంలో పుస్తక పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఈశ్వర్ లాల్ పవార్, టీజేపీఎస్ కళాశాల కమిటీ అధ్యక్షుడు వంశీ పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

నెహ్రూనగర్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఏపీ షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ జనరల్ మేడిద బాబూరావు, జిల్లా అధ్యక్షులు నేలటూరి ఐజాక్, జిల్లా కార్యదర్శి గుడిపూడి రమేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, రాజేష్, రత్నం, మాధవ్, రాజారావు పాల్గొన్నారు.

- అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, సంఘ నాయకులు జడా రవీంద్ర, బత్తుల వీరబాబు, బేతపూడి భారతి, కె సుజాత, నల్లపు నీలాంబరం, చిన్నం డేవిడ్ విలియమ్స్, రాయపూడి మరియదాసు పాల్గొన్నారు.
- భీమ్ భారత్ ఆధ్వర్యంలో సామాజిక న్యాయాన్ని సాధిద్దాం అనే నినాదంతో శంకర్‌విలాస్ సెంటర్ నుంచి లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, గంట ప్రభుదాస్, సాదు మాల్యాద్రి, జీఆర్ భగత్ సింగ్, సుధాకర్, జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ ఆధ్వర్యంలో చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ ఆధ్వర్యంలో ఓల్డ్ క్లబ్‌రోడ్డులోని సంఘ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- ఏపీ మాలమహానాడు ఆధ్వర్యంలో పాతగుంటూరులోని క్రిస్టియన్‌పేటలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిమెట్ల ఇస్సాకు, రాజేష్‌కుమార్, శ్రీధర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రజలందరికీ గర్వకారణం

గుంటూరు ఎడ్యుకేషన్: మన రాజ్యాంగం ఎంతో గొప్పదని, అన్ని వర్గాల ప్రజలందరికీ గర్వకారణమని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం చౌత్రా సెంటర్లోని పాఠశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన, రాజ్యాంగ విలువలను ప్రచారం చేయడం ఒక విధిగా ఆచరించాలని చెప్పారు. విద్యార్థులందరూ భారత రాజ్యాంగాన్ని చదివి దానికి అనుగుణంగా నడుచుకుంటూ భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

పటిష్ట విధానాలతో భారత రాజ్యాంగం

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్



జెండా ఊపి వాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, పక్కన జేసీ భార్గవ్‌తేజ్, కమిషనర్

గుంటూరు వెస్ట్: అద్భుతమైన రాజ్యాంగాన్ని మనకందించిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని రాజ్యాంగాన్ని గౌరవించాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్ చెప్పారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక లాడ్జిసెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, గుంటూరు నగరపాలక సంస్థ సంయుక్తంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ సర్వశ్రేష్ఠమైన భారత రాజ్యాంగాన్ని మనందరికి అందించిన ప్రపంచ మేధావి భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. భారత రాజ్యాంగంలో పొందు పరిచిన విలువలను కాపాడడంలో అందరూ తమ బాధ్యతలను గుర్తెరగాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ భారతీయ సంస్కృతులను నైతికత, మూల విలువలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని రూపొందించిందన్నారు. అనంతరం ఐదు కిలో మీటర్ల వాక్‌ను ఎమ్మెల్యే మాధవి, అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏడీ ఆర్.రమేష్‌చంద్ర, డీఆర్‌డీఏపీడీ విజయలక్ష్మి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డీఆర్వో షేక్ ఖాజావలి, స్టెప్ సీఈఓ కిరణ్మయి దేవిరెడ్డి పాల్గొన్నారు.



డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి



అంబేడ్కర్ ప్రతిమ వద్ద నివాళులర్పిస్తున్న బార్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, చిత్రంలో బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు



నగరపాలక సంస్థ సిబ్బందితో కలసి రాజ్యాంగ పీఠికను పఠిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున ఉపాధ్యాయులు

పీకలవాగు ముంపు నివారణకు చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



పీకలవాగును పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరం నుంచి మురుగు వెళ్లే పీకల వాగు మెయిన్ డ్రెయిన్ వేజెండ్ల, సుద్దపల్లి పంట పొలాల ముంపు నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ వేజెండ్ల, సుద్దపల్లి గ్రామాల పరిధిలో పీకల వాగు, సంగంజాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి తాగునీటి సరఫరా జరిగే పైప్ లైన్‌ని పరిశీలించారు. తొలుత వేజెండ్ల, సుద్దపల్లి గ్రామాల రైతులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం నుంచి గ్రామాల ప్రజలు పీకల వాగు పొంగడం వలన పంట పొలాలు మునిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల తమ దృష్టికి తీసుకొచ్చారని, సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలన కోసం వచ్చామని తెలిపారు. సంగం జాగర్లమూడి నుంచి వచ్చే తాగునీటి పైపులైన్ 3 ప్రాంతాల్లో పీకలవాగుని క్రాస్ చేస్తుందని, ఆయా ప్రాంతాల్లో కల్వర్ట్‌ల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యటనలో ఏసీపీ చంద్రశేఖర్, టీపీఎస్ లక్ష్మణస్వామి, సర్వేయర్ సుభాని, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్ 2 నుంచి..

గుంటూరు నగరంలోని సంజీవయ్య నగర్ రైల్వే గేటు నుంచి నెహ్రూనగర్ రైల్వే గేటు వరకు రోడ్, డ్రెయిన్ ఆక్రమణలను డిసెంబర్ 2 నుంచి తొలగింపు చేపడతామని, ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకొని జీఎంసీకి సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు.

రూ.45 లక్షల చెక్కు అందజేత

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకటనల బోర్డులు, హోర్డింగ్స్ నిర్వాహకులు ఫీజు బకాయిలు సకాలంలో చెల్లించాలని, బకాయిలు చెల్లించని బోర్డుల తొలగింపునకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్యాంటరీ బోర్డుల బకాయి రూ.45 లక్షల చెక్‌ను చైతన్య మీడియా సొల్యూషన్స్ మేనేజర్ సయ్యద్ బాబు కమిషనర్ అందజేశారు.

కాంట్రాక్టర్లకు తప్పని తిప్పలు..

- మాకు తెలిసిన వారు టెండర్ వేస్తామన్నారు.. మీరేవరు టెండర్ వేయడానికి వీల్లేదు
- ఇది నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సెక్షన్ సిబ్బంది తంతు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో వింత పోకడ నడుస్తోంది. ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్‌లో దేశంలో ఎక్కడ నుంచైన ఎవరైన పాల్గొని టెండర్ దక్కించుకోవచ్చు. కాని ఇక్కడ ఇంజినీరింగ్ అధికారులు ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్‌లో ఏ కాంట్రాక్టర్ పాల్గొనవద్దని.. ఎవరైన పాల్గొని టెండర్ దక్కించుకున్న వారికి బిల్లులు రాకుండా చేసి చూస్తామంటూ ఇన్‌డైరెక్ట్‌గా బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.25 లక్షల టెండర్

గుంటూరు నగరపాలక సంస్థ వెహికల్ షెడ్‌కి సంబంధించిన పుష్‌కార్ట్ సరఫరా, ఎక్స్‌కవేటర్, పారిశుద్ధ్య విభాగంలో వ్యర్థాలను తరలించేందుకు ట్రాక్టర్ వినియోగించేందుకు ఇతర పనుల నిమిత్తం మొత్తం సుమారు.25 లక్షల టెండర్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో(ఈ ప్రొక్యూర్‌మెంట్) నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పెట్టారు. అయితే టెండర్ కాలపరిమితి 15 రోజులు ఉండాల్సి ఉండగా... కేవలం మూడు రోజుల్లో టెండర్ ప్రక్రియ ముగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా కాంట్రాక్టర్లను ఎవరు ఇందులో పాల్గొనకుండా ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కమీషన్ల కోసమే..

ఇంజినీరింగ్ సెక్షన్‌లో తమ అనుకున్న వారికి టెండర్లు దక్కేలా చేసి వారి ద్వారా భారీ మొత్తంలో కమీషన్లు తీసుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులు పన్నాగమని చెప్పుకోవచ్చు.

ఎవరైన టెండర్ ప్రక్రియలో పాల్గొంటే వారికి బిల్లులు చెల్లింపులో చుక్కలు చూపిస్తున్నామని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బుధవారం మధ్యాహ్నం టెండర్ ప్రక్రియ ముగియనుంది. ఆరోపణలపై ఇంజినీరింగ్ ఈఈ సుందర్రామిరెడ్డిని వివరణ కోరగా టెండర్ ప్రక్రియలో ఎవరైన పాల్గొనవచ్చు, కాంట్రాక్టర్లు ఎవరైన టెండర్ పాల్గొని నిబంధనలకు అనుగుణంగా టెండర్ దక్కించుకోవచ్చని చెప్పారు.



[illegible]	769696	ET నం.32/2024-25, అంశం నం.13	[illegible]	[illegible]	₹ 9,10,780
[illegible]	769700	ET నం.32/2024-25, అంశం నం.14	[illegible]	[illegible]	₹ 9,10,780
[illegible]	767206	ET నం.34/2024-25 అంశం నం.12	[illegible]	[illegible]	₹ 8,25,000
[illegible]	767202	ET నం.34/2024-25 అంశం నం.13	[illegible]	[illegible]	₹ 5,23,800

స్వేచ్ఛా, సమానత్వమనే రక్షణ కవచం రాజ్యాంగం

ఏఎన్‌యూ వీసీ గంగాధర రావు



ఏఎన్‌యూ: భారత రాజ్యాంగం 75 ఏళ్లగా మనకి స్వేచ్ఛ, సమానత్వమనే రక్షణ కవచంగా నిలుస్తోందని వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. యూనివర్సిటీ లీగల్ స్టడీస్ విభాగం, డాక్టర్ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం సంయుక్తంగా రాజ్యాంగ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వీసీ ప్రసంగిస్తూ కేవలం మన బలమైన రాజ్యాంగ వ్యవస్థ కారణంగానే ప్రపంచంలో మన దేశం స్వేచ్ఛ సౌభాతృత్వాలతో వెలుగొందుతుందన్నారు. రెక్టార్ కె.రత్న షీలా మణి మాట్లాడుతూ తమ హక్కుల పరిరక్షణపై పరిజ్ఞానం ఇప్పటికీ చాలా తక్కువ మందికి మాత్రమే ఉందని, అందువల్లే చాలా మంది తమ హక్కుల్ని పొందటంలో విఫలమవుతున్నారన్నారు అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం మాట్లాడారు. కీలక ఉపన్యాసం చేసిన న్యాయశాస్త్ర బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.రంగయ్య మాట్లాడుతూ మన రాజ్యాంగాన్ని సొంతంగా రూపొందించుకోవటానికి ఆనాడు గాంధీ, నెహ్రూలు అంబేడ్కర్ వంటి విజ్ఞానవంతుణ్ణి మన రాజ్యాంగ పరిషత్ లోకి తీసుకువచ్చేందుకు చాలా శ్రమించాల్సి వచ్చిందన్నారు. ఆంగ్లేయుల సహకారంతో కాకుండా మన భారతీయుల స్వశక్తితో మన సొంత రాజ్యాంగాన్ని రూపొందించుకోవటానికి మహనీయులు కృషి చేశారన్నారు. ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, అంబేడ్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- నగరంలో వామపక్షాలు, ప్రజాసంఘాల భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం దేశవ్యాప్త కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని బ్రహ్మానందం స్టేడియం నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. అజయ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ఏపీ రైతు సంఘం నాయకులు పి.శివాజీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా రాజ్యాంగం ఉందన్నారు. దీనికి తూట్లు పొడిచేలా పాలకులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగాన్ని అందరూ కలిసి కాపాడుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మద్దతు ధరల చట్టం తీసుకొస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సీపీఎం జిల్లా నాయకుడు కె.నళినీకాంత్, జాతీయ రైతు కూలీ సంఘం నాయకులు యు.నాగేశ్వరరావు, ఏరువాక రైతు కూలీ సంఘం నాయకులు పాడిపండ్ల కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి హనుమంతరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్, కొల్లి రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు కె.శ్రీనివాసరావు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కోటయ్య పాల్గొన్నారు.

వేతన బకాయిలు ఇప్పించాలని మేయర్‌కు వినతి

నెహ్రూనగర్: వేతన బకాయిలు చెల్లించాలని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడికి నగరపాలక సంస్థలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం సంపత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆగస్టు, 2020 నుంచి ఏప్రిల్, 2021 వరకు కార్మికునికి రూ.3 వేలు చొప్పున వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఇప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అప్కాస్ ఏర్పాడే సమయంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వర్కర్లు ఇవ్వాల్సిన జీతంలో కొంత మేర కోత విధించారని... దానిని ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. స్పందించిన మేయర్ ఈ వారంలో స్టాండింగ్ కమిటీ సమావేశంలో బకాయిల విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మేయర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు మధుబాబు, యాకోబు, పోతురాజు, వెంకటేశ్వరరావు, రామయ్య ఉన్నారు.



నగర మేయర్ కావటికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు